వైఎస్ఆర్ కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 17 జూన్ 2026


## మహా కుంభాభిషేకం ప్రారంభం



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 16 ప్రభావత వార్త

పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో మంగళ వారం నుండి శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారితో పాటు శ్రీ అభయ వరద శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల మహా కుంభాభిషేక మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గోపూజ, గణపతి పూజ, వాస్తు హోమం, యాగశాల ప్రవేశం, త్రిశూల పూజ, షోడశ కలశ స్నపణం, అగ్ని ప్రతిష్టాపన, ప్రధాన కలశ స్థాపన, రుద్ర హోమాలు వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.వి. రమణ, చైర్మన్ వంగల నారాయణ రెడ్డి, పాలకమండలి సభ్యులు, పురోహితులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెరువుల అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు

### ఇరిగేషన్ శాఖ ఈఈ సురేష్‌బాబు



మదనపల్లె, జూన్ 16 ప్రభాతవార్త :

చెరువుల అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు మంజూరు అయినట్లు మైనర్ ఇరిగేషన్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో వివిధ పథకాల కింద 76చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వీటిలో 58చెరువులు ప్రారంభించగా 18చెరువుల అభివృద్ధి పనులు వివిధ నిర్మాణ ఉన్నాయన్నారు. 21చెరువులు నీటి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు తెలిపారు. మదనపల్లె డివిజన్ పరిధిలో కొన్ని చెరువుల అభివృద్ధికి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. రూ.5.75 కోట్లతో చెరువు పనులు ప్రారంభిస్తామన్నారు. తంబళ్ళపల్లె, బి.కొత్తకోట, కురబలకోట, పెద్దమండ్యం, పిటిఎం, మొలకలచెరువు, కలికిరి, వాల్మీకిపురం, పీలేరు, మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లో చెరువుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా చెరువుల కట్టల మరమ్మత్తులు, సెప్లైఛాన్‌ల మరమ్మత్తులు, పూడికతీత పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. చెరువుల అభివృద్దే ప్రధాన ద్యేయంగా పనిచేయడం జరుగుతుందన్నారు.

# కడపలో ఐదు రోజుల ఏపీఎల్ క్రికెట్ జాతర

**ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో తొలిసారి టీ20 సమరం**

**ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం...**

**ప్రారంభ వేడుకల్లో సాంస్కృతిక సంబరాలు**



కడప, జూన్ 16 ప్రభాతవార్త:

రాయలసీమ క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) 2026 రెండో దశ మ్యాచ్‌లకు కడప సిద్ధమైంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టా త్మక టోర్నీ బుధవారం నుంచి స్థానిక వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడి యంలో ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ క్రికెట్ మహోత్సవంలో మొత్తం 8ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. ఈసారి ఏపీఎల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ప్రమాణాల ఫ్లడ్‌లైట్లు. తొలిసారిగా కడపలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో మ్యాచ్‌లు జరగనుండటంతో జిల్లా వ్యాప్తంగా క్రీడాభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. సాయంత్రం జరిగే మ్యాచ్‌లు క్రీడా వినోదాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లనున్నాయి.

**క్రికెట్ అభిమానులకు పండుగ వాతావరణం**

ఏడు జట్లు బరిలోకి దిగుతున్న ఈ టోర్నీలో ప్రతి మ్యాచ్ కీలకంగా మారింది. ప్లేఆఫ్స్ రేసు ఉత్కంఠభరితంగా కొనసాగుతుండటంతో జట్ల మధ్య పోటీ మరింత రసవత్తరంగా ఉండనుంది. ప్రతి రోజూ రెండు మ్యాచ్‌లు నిర్వహించనుండగా, తొలి మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు, రెండో మ్యాచ్ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుంది.

**ప్రారంభ వేడుకల్లో కళా వైభవం**

టోర్నీ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాంస్క ృతిక కార్యక్రమాలు, సంగీత ప్రదర్శనలు, యువతను ఆకట్టుకునే వినోద కార్యక్రమాలతో ప్రారంభ వేడుకలను రంగరించ నున్నారు. క్రికెట్‌తో పాటు వినోదానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రేక్షకులకు మరపురాని అనుభూతిని అందించేందుకు సన్నాహాలు చేశారు.

**రూ.7 కోట్లతో ఆధునిక సదుపాయాలు**

ఏపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణ కోసం స్టేడియంలో ఆధునిక వసతులను ఏర్పాటు చేశారు. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఫ్లడ్‌లైట్లు, ప్రేక్షకుల గ్యా లరీలు, ఆటగాళ్లకు ప్రత్యేక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్, తాగునీటి వసతులు కల్పించారు. రాష్ట్ర స్థాయి టోర్నీల నిర్వహణకు కడప స్టేడియం సిద్ధంగా ఉందని ఈ ఏర్పాట్లు నిరూపిస్తున్నాయి.

**ఊరూరా ఏపీఎల్ సందడి**

ఏపీఎల్ ప్రచారం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా జోరందుకుంది. ప్రత్యేక ప్రచా ర గీతాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, ప్రధాన కూడళ్లలో హో ర్డింగ్స్, బ్యానర్లు, బెలూన్లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. పలు ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాలలు విద్యార్థులకు ప్రత్యక్షంగా మ్యాచ్‌లు వీక్షించే అవకాశం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

**ఉచిత ప్రవేశం – అభిమానులకు వరం**

టోర్నీలోని అన్ని మ్యాచ్‌లకు ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పించడం విశేషం. కుటుంబ సమేతంగా వచ్చి క్రికెట్‌ను ఆస్వాదించేందుకు ఇది మంచి అవకాశమని నిర్వాహకులు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి అభిమానులు పెద్ద సంఖ్యలో స్టేడియంకు తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఏసీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు భరత్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మునికుమార్‌రెడ్డి, కార్యదర్శి రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రేక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

**కడపలో క్రికెట్‌కు కొత్త అధ్యాయం**

ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో జరగనున్న ఏపీఎల్ మ్యాచ్‌లతో కడప మరోసారి రాష్ట్ర క్రికెట్ మ్యాప్‌లో ప్రత్యేక గుర్తింపు పొందనుంది. ఐదు రోజుల పాటు క్రికెట్ సందడితో వైఎస్ రాజారెడ్డి స్టేడియం అభిమానుల కేరింతలతో మారుమోగ్గనుంది.

# రెండేళ్ళ కూటమి పాలనలో ఎంతో అభివృద్ధి చేశాం

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మదనపల్లె, జూన్ 16 ప్రభాతవార్త :

రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు పంక్షన్‌హాలులో కూటమి ప్రభుత్వ రెండేళ్ళ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. గత ఐదేళ్ళ అచారకపాలన అంతం చేసి అధికారంలోకి వచ్చిన ప్రజాపాలనలో ముఖ్యమంత్రి నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కూటమి పార్టీల నాయకుల సహకారంతో ఈనెల 20న ముఖ్యమంత్రి నిర్వహించే పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించి 140ఏళ్ల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారన్నారు. ముఖ్యమంత్రిచే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. అనంతరం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా కార్యదర్శి తులసీ రామక్రిష్ణ మాట్లాడుతూ గొడ్డలి పార్టీ నేతలకు మహిళలు అంటే గౌరవం లేదన్నారు. గత ఐదేళ్ళ వైసిపి పాలనలో మహిళకు అన్ని విధాల అవమానం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో మహనాడు పరిశీలకులు నెట్టం వెంకటేష్, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, విజయభారతి స్కూల్ అధినేత డాక్టర్ ఎన్.సేతు, ఎస్ఎ.మస్తాన్, జనసేన రామాంజనేయులు, ఏఎంసి చైర్మెన్ జంగాల శివరామ్, కార్పోరేషన్ డైరెక్టర్ రామక్రిష్ణాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్‌ఖాన్, నాయకులు సుధాకర్, బాలుస్వామి, అరుణ్‌తేజ, రాధ, పులి మహాలక్ష్మి డ్యాన్స్ రెడ్డప్ప, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో కూటమి విజయోత్సవ ర్యాలీ



వార్త.. 2లో

# గాండ్ల తిమ్మాయపల్లెలో యదేచ్ఛగా మట్టి తవ్వకాలు

**ఎలాంటి అనుమతి లేకుండా తవ్వకాలు**

**రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైనట్లు సమాచారం**

**మట్టిని తరలిస్తున్న మున్సిపాలిటీలోని కాంట్రాక్ట్ కార్మికుడు**

బద్వేలు ,జూన్ 16, ప్రభాతవార్త :

బద్వేలు మండల పరిధిలోని గాండ్ల తిమ్మాయపల్లె పరిసరాలలో మట్టి తవ్వకాలు యదేచ్ఛగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఒక ప్రైవేటు కాంట్రాక్ట్ కార్మికుడు తన స్వంత జేసీబీతో కొండను తవ్వి మట్టిని విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇందుకు రెవెన్యూ అధికారులు కుమ్మక్కై గత అర్థరాత్రి నుంచి తవ్వుతున్నట్లు తెలుస్తోంది. గత 10 రోజుల క్రితం కూడా ఇలాగే ఆ ప్రైవేటు కాంట్రాక్ట్ కార్మికుడు మట్టిని బయటకు తరలించినట్లు సమాచారం. అయితే రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అర్థరాత్రి నుంచి తవ్వుతుండగా లావాదేవీల విషయంలో ఆ కార్మికుడికి రెవెన్యూ సిబ్బంది వత్తాసు పలకడంతోనే ఈ మట్టి తరలింపు జరుగుతోందని రెవెన్యూ కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. గత రెండురోజుల మిగతా 2వ పేజీలో






# త్వరలోనే అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం

**ప్రజా వేదికలో సీఎం ఇచ్చిన హామీ కార్యరూపం**

**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**



అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలిస్తున్న జగన్మోహన్ రాజు

రాజంపేట, జూన్ 16 ప్రభాతవార్త :

జగన్ హయాంలో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు అతి త్వరలోనే ప్రారంభం కానున్నట్లు రాజం పేట టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రెడ్డి వెల్లడిం చారు. క్రితినా ఇది సెప్టెంబర్ 1న రాజంపేట ప్రజా వేదికలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చే దిశగా అడు గులు పడ్డాయని పేర్కొన్నారు. మంగళవారం అన్న మయ్య ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జవాద్ తుఫాన్ సమ యంలో మా నవ తప్పిదం కారణంగా గేట్లు ఎత్తకపోవడంతో తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం కోసం వడివడుగా పనులు జరు గుతున్నాయన్నారు. వైకాపా నేతల స్వార్థానికి తెగిపోయిన అన్న మయ్య డ్యామ్ వలన ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు ఆస్తి నష్టం వాటిల్లి ఎందరో జీవితాలు అల్లకల్లోలం అయ్యాయన్నారు. జల విధ్వంసంతో వందలాదిమంది నిరాశ్రయుల య్యారని, బాధితు లను ఆదుకోవడంలో నాటి వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. పునరావాసంలో నేటికీ పూర్తికాని అనేక గృహాలు దర్శనమిస్తున్నాయని,కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వారిని అన్ని విధాల ఆదుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారని తెలియ జేశారు.సాంకేతిక నిపుణుల సలహా కమిటీని ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన నిర్మాణం చేపట్టేందుకు ఐఐటి చెన్నై, సిడబ్ల్యుసి తదితరులతో కలిసి ఏడాది పాటు అధ్యయనం చేసి డిజైన్ రూపకల్పన జరుగుతుందనన్నారు. ప్రస్తుతం ఉన్న ఐదు గేట్లతో పాటు మరో మూడు నుండి నాలుగు అదనపు గేట్లు ఏర్పాటుతో వీలైనన్ని ఎక్కువ చెరువులకు అనుసంధా నించి త్వరలోనే డ్యాం పునర్నిర్మాణం గావించి రైతాంగాన్ని ఆదుకు నేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అన్నమయ్య ప్రాజెక్టు ఈ.ఈ నారాయణరెడ్డి, డిఇఇ తేజో వతి, ఏఈ ఎం. హేమంత్, డి.దస్తగిరి,మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బనరసయ్య నాయుడు,వైస్ చైర్మన్ చెంగల్ రాయుడు,పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు,మండల క్లస్టర్ ఇం చార్జ్ దగ్గుపాటి వెంకటేశ్వర్ నాయుడు,మలిశెట్టి సుబ్బరాయుడు, నాగ రాజా,పరశురాం నాయుడు, రామ్మోహన్ పాల్గొన్నారు.




# మట్టి తవ్వకాలు

మొదటి పేజీ తరువాయి

నుంచి మట్టి తరలిస్తున్నారంటే వీఆర్వోకు తెలియదంటే నమ్మశక్యంగా లేదనడం హాస్యాస్పదంగా ఉందని, మట్టిని తరలించాలంటే మైనింగ్ అధికారుల తప్పనిసరి అని రెవెన్యూ అధికారులు కూడా అనుమతిస్తే తప్ప మట్టిని తవ్వేందుకు ఎలాంటి అనుమతులు ఉండవు. కానీ ఇక్కడ అనధికారికంగా రెవెన్యూలోని కొంతమంది అధికారులు , సిబ్బంది కుమ్మక్కై మట్టిని యదేచ్ఛగా తరలిస్తూ లక్షలు గడిస్తున్నట్లు సమాచారం. గ్రామ పరిధిలో ఎలాంటి ఆక్రమణలు జరిగినా, మట్టి తరలింపు జరిగినా రెవెన్యూలోని కిందిస్థాయి సిబ్బందికి తెలిసినప్పటికీ అధికారులకు తెలియకుండా జాగ్రత్త పడ్డారంటే మామూలు తీసుకోకుండానే దీనికి అనుమతిస్తారా అని అక్కడి ప్రజలు అంటున్నారు. బద్వేలులో ఎవరికి నచ్చినట్లు వారు చేసుకుంటున్నారు తప్ప అనుమతుల విషయంలో జాగ్రత్తలు పాటించకపోగా అధికారులతో కుమ్మక్కై చేయడమే కాకుండా ఇది బట్ట బయలు అయితే తమకేమి తెలియనట్లుగా తప్పించుకోవడం ఆనవాయితీగా మారింది. ఇప్పటికైనా అధికారులు మట్టి తవ్వకాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## తంబళ్లపల్లెకు 1200 క్వింటాల విత్తన కాయలు



**తంబళ్లపల్లె జూన్ 16 ప్రభాతవార్త ః** తంబళ్లపల్లె మండలం లోని రైతులకు ఖరీఫ్ సీజనకుగాను 1200 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు వచ్చినట్లు రమణ కుమార్ విలేకరులకు తెలిపారు. మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల్లో కే సిక్స్ వేరుశనగ విత్తన కాయలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ వ్యవసాయ ఏడాదికి మొత్తం 2000 క్వింటాళ్లు ఇండెంట్ పెట్టామని రైతులకు అవసరం ఉంటే మరిన్ని విత్తన కాయలు తెప్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. విత్తన కాయలు కే సిక్స్ 30 కిలోలు బస్తా రూ 1836 చొప్పున రైతులు తమ పాసుబుక్కులతో పేర్లు నమోదు చేసుకుని కాయలు పొందాలని సూచించారు. ప్రస్తుతం కే సిక్స్ పినకాయలు వచ్చాయని జిసిడిఎస్ అనే కొత్త రకం వస్తాయని ఆసక్తిగల రైతులు తీసుకోవచ్చని ఏఓ తెలిపారు. ఆయన వెంట ఏఈవోలు సురేష్, రెడ్డి శేఖర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా శ్రీనివాసులునాయుడు ప్రమాణస్వీకారోత్సవం



**మదనపల్లె, జూన్ 16 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ మాజీ రక్షణ దళాల రాష్ట్ర అధ్యక్షులుగా కంచెర్ల శ్రీనివాసులునాయుడు ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ కంచెర్ల శ్రీనివాసులునాయుడు గతంలో దేశ రక్షణలో, సమాజసేవలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. డివిజన్ సంఘం అధ్యక్షునిగా సైనికులకు అండగా నిలిచి అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. పట్టణంలో హిందూ శ్మశాన వాటిక పరిరక్షణకు కృషి చేశారన్నారు. మాజీ సైనికుల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పని చేస్తానని ఆయన ఈసందర్భంగా తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర టిడిపి తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి, జనసేన పార్టీ కోఆర్డినేటర్ రాందాస్‌చౌదరి, రాటకొండ బాబు రెడ్డి, కాంగ్రెస్ రెడ్డిసాహెబ్, ఏఎంసి ఛైర్మెన్ జంగాల శివరామ్, సీడ్ మల్లికార్జున నాయుడు, మాజీ సైనికులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థలో అన్నదానం




**మదనపల్లె, జూన్ 16 ప్రభాతవార్త :** పట్టణ సమీపంలోని దేవతా నగర్‌లో ఉన్న చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ సెక్రటరీ కవితారాణి మాట్లాడుతూ యువశక్తి ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది దాతలు చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థకు పరిచయం చేస్తూ అన్నదానంతోపాటు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నారన్నారు. యువశక్తి టీమ్ కో-ఫౌండర్ జాఫర్‌బాషా విద్యార్థులకు పుస్తకాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారన్నారు.

## విలేజ్ రెస్టారెంట్‌లో దివ్యాంగులకు అన్నదానం




**మదనపల్లె, జూన్ 16 ప్రభాతవార్త :** పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగుసంస్థలోని దివ్యాంగులు, వృద్ధులకు విలేజ్ రెస్టారెంట్‌లో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుంగనూరు రోడ్డులోని విలేజ్ రెస్టారెంట్ యాజమాన్యం తులసీరామ్ దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జన్మదిన సందర్భంగా వెలుగు స్కూల్ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు, వృద్ధులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. అనంతరం వెలుగుస్కూల్ సెక్రటరీ తులసీరామ్‌ను ఘనంగా సత్కరించి మెమోంటోను అందజేశారు. ఈకార్యక్రమంలో వెలుగుస్కూల్ సూపరింటెండెంట్, వీసి సభ్యులు సుజాత, సోషల్ వర్కర్ గీతా, వార్డెన్ స్వీటిలు పాల్గొన్నారు.

## న్యాయ సలహా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**తంబళ్లపల్లె జూన్ 16 ప్రభాతవార్త ః** తంబళ్లపల్లె నియోజకవర్గం పరిధిలోని ప్రజలు ఉచిత న్యాయ సహాయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికారి బి. సుభాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.హైకోర్టు ఆదేశాల మేరకు అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర కు చెందిన ప్రజలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు న్యాయ సేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవసరం ఉన్న కక్షిదారులు ఈ న్యాయ సహాయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పదవ తరగతిలో ప్రతిభ విద్యార్థులకు నగదు బహుమతులు



**కురబలకోట, జూన్ 16, ప్రభాతవార్త.** మండల కేంద్రమైన కురబలకోట జడ్పీ హైస్కూల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులను దాత డాక్టర్ కె .లక్షీ ్మరాఘవరావు అందజేశారు. మంగళ వారం కురబలకోట జడ్పీ హైస్కూల్లో 20,2526 పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కురబలకోట గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ కామకోటి రాఘవరావు జ్ఞాపకార్థం మొదటి నగదు బహుమతిగా సమీరా అంజుమ్‌కు రూ.8000లు, సారాకి రెండో బహుమతి కింద రూ.6000లు, మూడవ బహుమతి అల్మాస్‌కు రూ. 4,000లను సతీమణి డాక్టర్ లక్ష్మీ రాఘవరావు అందజేశారు. రచయిత్ర, సాహితీవేత్త, ఉన్నత వ్యక్తి డాక్టర్ లక్షీ ్మ రాఘవరావు విచ్చేసి ప్రతిభ విద్యార్థులకు నగదు బహుమతులు,పాఠశాల లైబ్రరీకి పుస్తకాలను, అందజేయడం గర్వించదగ్గ విషయమని హెడ్మాస్టర్ శ్రీదేవి అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను దాతలు ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల హెడ్మాస్టర్ ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 శ్రీనివాసులు ఇన్చార్జి హెచ్ఎం శివయ్య, ప్రముఖ రఘునందనరావు, స్కూల్ కమిటీ ఛైర్మన్ కే రఫీ, కోఆప్షన్ మెంబర్ నరసింహులు. రాజారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లెలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తా

### ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తా: మాజీ ఎమ్మెల్యే జి శంకర్ యాదవ్




**తంబళ్లపల్లె, జూన్ 16 ప్రభాతవార్త ః** తంబళ్లపల్లె నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీని ఒక్కతాటిపై నిలిపి పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానని, ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ భావోద్వేగంతో వ్యక్తంచేశారు. మంగళవారం బి.కొత్తకోటలో టిడిపి పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి టిడిపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా అరాచక పాలనతో టిడిపి నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యాలు, అక్రమ కేసులతో పాటు అన్ని రకాలుగా నష్టపోయారని వారిని ఆదుకునే దిక్కు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు అధికారం ఉండి నేటికి టిడిపి నాయకులు పడుతున్న కష్ట నష్టాలను కళ్ళారా చూశానని పార్టీ కోసం ధైర్యంగా నిలబడి నిలిచిన మీకోసం ఏ త్యాగానికైనా సిద్ధమని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా నిలిచిన తంబళ్లపల్లె ను గత ఎన్నికల్లో కోల్పోవడం బాధాకరమని ఎన్ని కష్టాలు వచ్చినా టిడిపి క్యాడర్ చెక్కుచెదరలేదని అలాంటి కార్యకర్తల కోసం అండగా నిలబడి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని తంబళ్లపల్లె నియోజకవర్గం సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాబోయే మంచి రోజులకు ప్రతి టిడిపి కుటుంబ సభ్యుడు ముందుకు రావాలని ప్రభుత్వ అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో అవినీతి వైకాపాకు గుణపాఠం నేర్పాలన్నారు. సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గ టిడిపి శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే జి శంకర్ యాదవ్ అండగా నిలబడి పార్టీకి పూర్వ వైభవం తీసుకు వస్తారని నాయకులు కార్యకర్తలు ఐకమత్యంతో ఆయనకు పూర్తి సహకారం అందించాలన్నారు. బిజెపి సీనియర్ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి మాట్లాడుతూ తంబళ్లపల్లె కు కూటమి పాలనలో హంద్రీనీవా జలాలతో రైతులు, రోడ్లు, అభివృద్ధి పనులు పూర్తి కావడం ఖాయం అన్నారు. తొలుత మాజీ ఎమ్మెల్యే జి శంకర్ యాదవ్ బి కొత్తకోటలో వందలాదిగా టిడిపి నాయకులు కార్యకర్తలు పూలమాలలు, దుశ్శాలువులతో ఘనంగా సత్కరించి చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, జి శంకర్ నాయకత్వం వర్ధిల్లాలి నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్ తాజ్, నియోజకవర్గంలోని 6 మండలాల టిడిపి మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జులు, బూత్ కమిటీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వందలాదిగా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండేళ్లలో రాయచోటి రూపురేఖలు మార్చిన మంత్రి మండిపల్లి


### గండికోట సుధాకర్



**రాయచోటి జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి విశేష కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని టిడిపి రాయచోటి రూరల్ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా మంత్రి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై ఆయన ప్రశంసలు కురిపించారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ:గాలివీడు మండలంలోని వెలుగల్లు ప్రాజెక్టు నుంచి రామాపురం మండల పరిధిలోని చెరువులను నీటితో నింపించి రైతులకు సాగునీటి భరోసా కల్పించిన ఘనత మంత్రి రాంప్రసాద్ రెడ్డికే దక్కుతుందన్నారు.సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రైతాంగానికి ఎంతో మేలు జరిగిందన్నారు. అందుకే ప్రజలు ఆయనను "అపర భగీరథుడు"గా అభివర్ణిస్తున్నారని తెలిపారు.రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు చేయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారని కొనియాడారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్లు అందించేందుకు మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులను వేగవంతం చేస్తున్నారని వివరించారు.అలాగే జలధార ప్రాజెక్టు ద్వారా రాయచోటిలోని మాండవ్య నది ప్రక్షాళన కోసం రూ.2 కోట్లు కేటాయించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి వనరుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని అన్నారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలలో అత్యంత ప్రజాదరణ పొందిన శ్రీ శక్తి పథకాన్ని మహిళలు విశేషంగా అభినందిస్తున్నారని సుధాకర్ తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, తాగు నీటి సదుపాయాలు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం ద్వారా అభివృద్ధిని గ్రామస్థాయికి తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో లబ్ధిదారుల నుంచి రూ.5 చొప్పున రుసుము తీసుకుని భోజనం అందిస్తున్నప్పటికీ, రాయచోటిలో మాత్రం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తన సొంత నిధులతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తూ ప్రజలకు పూర్తిగా ఉచితంగా భోజనం అందిస్తున్నారన్నారు.పేదలు, కార్మికులు, నిరుపేద కుటుంబాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారిందని, ప్రజల ఆకలి తీర్చడంలో మంత్రి చూపుతున్న మానవత్వం ఆదర్శనీయమన్నారు. అదేవిధంగా గత రెండేళ్లలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) ద్వారా రాయచోటి నియోజకవర్గంలోని పేదలకు రూ.12 కోట్లకు పైగా ఆర్థిక సాయం చెక్కుల రూపంలో అందజేసి అనేక కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో మంత్రి ముందుంటున్నారని, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాయచోటి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నారని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అన్నమయ్య జిల్లాలో వైయస్సార్సీపి పార్టీని బలోపేతం చేయాలి

### వైఎస్ఆర్సిపి డిస్టిక్ ఐటి విభాగం జనరల్ సెక్రెటరీ సుహేల్



**పీలేరు జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర పరిధిలోనే కాకుండా ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తున్నామని అలాగే తమ ఆశీస్సులు కూడా మా పై ఉండాలని జిల్లా వైఎస్ఆర్సిపి ఐటి విభాగం జనరల్ సెక్రెటరీ సుహేల్ సజ్జల రామకృష్ణారెడ్డిని కోరారు మంగళవారం రాష్ట్ర రాజధాని గుంటూరులో సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వంగా వైకాపా యువనాయకులు మాసూమ్‌తో కలిసి ఆయనను ఘనంగా పూలమాల శాలువాతో సన్మానించిన అనంతరం సుహేల్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే యువ నాయకుల వైయస్సార్ పార్టీని ముందుకు తీసుకు వెళ్లడానికి తమ వంతు కృషి చేస్తున్నామని అదే విధంగా జిల్లాలో జరిగే ఐటి విభాగంలో చురుకుగా పనిచేసే యువనాయకులు కూడా చేరుతున్నారని తమరు కూడా జిల్లా సందర్శించినప్పుడు ఐటీ విభాగానికి చేయూతనివ్వాలని కోరినట్లు సుహేలు తెలిపారు ఇలాగే ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినట్లు వారు తెలిపారు.

## 20న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

### మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమల సుదర్శనం

**పీలేరు జూన్ 16 ప్రభాతవార్త:** క్రీమేలియర్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా జూన్ 20న మదనపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మాల మహానాడు ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమల సుదర్శనం పిలుపునిచ్చారు. మంగళవారం మదనపల్లి పట్టణం నిమ్మనపల్లి సర్కిల్లోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యమల సుదర్శనం మాట్లాడుతూ భారత రాజ్యాంగం కు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారుఎస్సీ వర్గీకరణ చేయాలంటే పార్లమెంటులో అన్ని రాష్ట్రాలు అనుమతి పొందిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి తప్ప ఎవరికి ఇష్టం వచ్చినట్లు అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమల సుదర్శనం ఈ వర్గీకరణను వ్యతిరేకించినారు.

## మహిళలను కించపరిస్తే సహించం

### మాజీ మంత్రి అమర్నాథ్‌పై జనసేన, టీడీపీ నేతల ఆగ్రహం



**పీలేరు జూన్ 16 ప్రభాతవార్త:** వైసీపీ మాజీ ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖలో హోం మంత్రి వం గలపూడి అనితపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూటమి శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. పీలేరులో మంగళ వారం జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు సం యుక్తంగా మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత కలప రవి మాట్లాడుతూ "రాజకీయాల్లో విమర్శలు సహజం. కానీ వ్యక్తిగత దూషణలకు దిగడం మాజీ మంత్రి స్థాయి వ్యక్తికి తగదు. హోం మంత్రి అనిత గారి ని ఉద్దేశించి మేకప్ మంత్రి అనడం యావత్ మహిళా లోకాన్ని కించపరిచినట్టే. వైసీపీ నేతల కు మహిళలంటే గౌరవం లేదు అనేది మరోసారి రుజువైంది. వెంటనే అమర్నాథ్ తన వ్యాఖ్య లను ఉపసంహరించుకుని మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు మాట్లాడుతూ "ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేక వైసిపి నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేస్తున్నారు. ఆమెను విమర్శించే స్థాయి అమ ర్నాథ్‌కు లేదు. ఇలాంటి వ్యాఖ్యలు పునరా వృతం అయితే కూటమి శ్రేణులు చూస్తూ ఊరుకో మని హెచ్చరిం చారు. అమర్నాథ్ వ్యాఖ్యలను ఖండిస్తూ కూటమి కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలి మహేష్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో కూటమి విజయోత్సవ ర్యాలీ

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 16 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రొద్దుటూరులో మంగళవారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ గాంధీ రోడ్డు, విజయకుమార్ సర్కిల్, టీబీ రోడ్డు, రాజీవ్ సర్కిల్ మీదుగా శివాలయం సర్కిల్ వరకు కొనసాగింది. కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో పట్టణ టిడిపి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు అవసరమని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు కొండవీటి భావన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లోనూ ప్రజలు అండగా నిలవాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమ య్యాయని తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పురోగతితో పాటు పలు కీలక కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి బలమని, ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. యువ నాయకుడు నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ యువత రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం యువతకు ఉపాధి, విద్యా అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రజల ఆశీస్సులతో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా పార్టీ జెండాలు, నినాదాలతో పట్టణంలోని ప్రధాన వీధులు సందడిగా మారాయి. ఈ ర్యాలీలో నియోజకవర్గ అబ్జర్వర్ భావన, టిడిపి ప్రధాన కార్యదర్శి విఎస్ ముక్తియార్,మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఒక్కోర్డు రాష్ట్ర డైరెక్టర్ బేపారి జాకీర్ అహ్మద్, అగస్త్యేశ్వరాలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, మాజీ జెడ్పిటిసి తోట మహేశ్వర్ రెడ్డి,వాల్మీకి,బోయ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జేబీవుల్ల, టిడిపి నాయకుడు ఇవి సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, మాజీ సింగిల్విండో చైర్మన్ రాజు వారి వెంకటసుబ్బయ్య, టిడిపి బీసీ నాయకుడు ఆకుల వెంకటరమణ, బిజెపి జిల్లా కార్యదర్శి కోనేటి ప్రదీప్ రెడ్డి, జనసేన నాయకులు మంచి శివకుమార్, సుంకర మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ బ్యాంక్ అభివృద్ధిలో సంఘమిత్రలే కీలకపాత్ర

### రీజనల్ మేనేజర్ ఇందిర



**తంబళ్లపల్లె, జూన్ 16, ప్రభాతవార్త** ఇండియన్ బ్యాంక్‌ల ఆర్థిక లావాదేవీలతో పాటు అభివృద్ధిలో వెలుగు సంఘమిత్రలదే కీలకపాత్రని ఇండియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఇందిర ప్రశంసించారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఏపీఎం గంగాధర్ ఆధ్వర్యంలో వెలుగు సంఘమిత్రల సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తంబళ్లపల్లె, కోసువారిపల్లె ఇండియన్ బ్యాంకుల పరిధిలో మహిళా సంఘాలు రుణాల సద్వినియోగంలో సత్ఫలితాలు సాధించినట్లు చెప్పారు. బ్యాంకు లింకేజీతో పాటు పలు రకాల రుణాలను అందించడానికి బ్యాంకులు సహకరిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆర్థిక ఏడాదిలో 33 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీకి వెలుగు ఏపీఎం తోబాటు సీసీలు, వివో లీడర్లు, సభ్యులు, సంఘమిత్రలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాంక్ పరంగా మహిళా సంఘాల సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బ్యాంకు రుణాలు పంపిణీలో పారదర్శకత పాటించి భవిష్యత్తులో ప్రతి మహిళ లక్షాధికారి కావడమే లక్ష్యంగా తమ సహకారం ఉంటుందన్నారు. ఏపీఎం మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ లు మహిళా సంఘాలకు అందించిన రుణ సౌకర్యంపై కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో మరింత ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె, కోసువారిపల్లి మేనేజర్లు ఎస్ఎన్‌డి మంజూర్ ఇలాహి, నాగరాజు, ఐకెపి అధ్యక్షురాలు రామ లక్ష్మమ్మ, సీసీలు కత్తి నరసింహులు, రమణ, ఆదిలక్షీ ్మ, వివో లీడర్లు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

## ఫిన్లాండ్ అంతర్జాతీయ శిక్షణకు అన్నమయ్య జిల్లా నుంచి సిద్ధారెడ్డి ఎంపిక



**మదనపల్లె క్రైమ్ జూన్ 16 ప్రభాతవార్త.** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంతర్జాతీయ స్థాయి విద్యా శిక్షణా కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా నుంచి సిద్ధారెడ్డి ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎంపిక చేసిన 29 మంది ఉపాధ్యాయులను ఫిన్లాండ్ దేశంలో అంతర్జాతీయ స్థాయి శిక్షణకు పంపుతున్నట్లు రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ సంచాలకులు శ్రీనివాసరావు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్, ఎస్సీ ఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక శిక్షణకు అన్నమయ్య జిల్లా పెద్దమండెం మండలం, గుడిసివారిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. సిద్ధారెడ్డి ఎంపికయ్యారు. ఉపాధ్యాయులకు విద్యాబోధనలో అత్యాధునిక మెలకువలు నేర్పేందుకు ఈ శిక్షణను మొత్తం మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. తొలి విడత శిక్షణా తరగతులు ఈనెల 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజీలో జరగనున్నాయి. ఫిన్లాండ్‌లోని ప్రముఖ ఖితుర్కు యూనివర్సిటీకి చెందిన అంతర్జాతీయ ప్రొఫెసర్లు ఆరి, సారీ ఉపాధ్యాయులకు ప్రత్యక్ష శిక్షణ ఇవ్వనన్నారు. రెండో విడతలో భాగంగా ఆగస్టు 15 నుండి 28 వరకు ఉపాధ్యాయులు నేరుగా ఫిన్లాండ్ దేశంలో పర్యటించనున్నారు. ఫిన్లాండ్‌లో శిక్షణ ముగిసిన అనంతరం, ఉపాధ్యాయులు తిరిగి వచ్చి మన రాష్ట్ర, జిల్లా పరిధిలోని పాఠశాలల్లో ఆ విద్యా విధానాలను అమలు చేస్తారు. ఈ అమలు ప్రక్రియను ఫిన్లాండ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు ఆన్‌లైన్ ద్వారా నిరంతరం పరిశీలిస్తూ, మన ఉపాధ్యాయులకు అవసరమైన తదుపరి ఆన్‌లైన్ శిక్షణను, సూచనలను అందిస్తారని సమగ్ర శిక్ష సంచాలకులు శ్రీనివాసరావు వివరించారు. అంతర్జాతీయ స్థాయి శిక్షణకు పెద్దమండెం మండలం నుంచి సిద్ధారెడ్డి ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

## నేడు వేరుశెనగ విత్తన కాయల పంపిణీ

**కురబలకోట,జూన్ 16, ప్రభాతవార్త:** కురబలకోట మండలంలో ఖరీఫ్ సీజన్ లో వేరుశనగ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీపై విత్తనకాయలు బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారిని వినూత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కే 6449.1 క్వింటాళ్లు, టి సి జి ఎస్ విశిష్ట200 క్వింటాళ్లు వచ్చాయన్నారు. ఈ విత్తన కాయలను మండలంలోని అంగళ్లు, ఎర్రబల్లి, కనసానివారిపల్లి, దాదంవారిపల్లి, మట్లివారిపల్లి, పిచ్చలవాండ్లపల్లి, చింతమాకులపల్లి రైతుసేవా కేంద్రాల లో ఉదయం 8.30 గంటలకు పంపిణీ మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. 30 కిలోల బ్యాగ్ ధర రూ.1836గా ప్రభుత్వం నిర్ధారించదన్నారు. మండలానికి అలాట్ మెంట్ 1300 క్వింటాళ్లు ఉండగా ప్రస్తుతం 50శాతం విత్తన కాయలు అందుబాటులో ఉన్నాయని, మరో 50శాతం కూడా వస్తాయన్నారు. ప్రస్తుతానికి ఒక్కో రైతుకూ ఒక్కో బ్యాగ్ ఇస్తామని, రైతులు నగదు, ఆధార్ కార్డుతో పంపిణీ కేంద్రాలకు వెళ్లాలన్నారు.

## టిడిపి కార్యదర్శి ప్రతాప్ నాయుడు బంధువులపై దాడి



**పెద్దమండెం జూన్ 16 ప్రభాతవార్త** మండలంలోని దిగుపల్లి పంచాయతీ లోని దిగుపల్లి టిడిపి కార్యదర్శి ప్రతాప్ నాయుడు వాళ్ళ బంధువులపై అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యుగంధర్ రెడ్డి అతని బంధువులు కత్తులతో కట్టెలతో రాళ్లతో దాడి చేసి గాయపరిచినట్లు ఎస్సై హరిహర ప్రసాద్ తెలిపారు. ప్రతాప్ నాయుడు ఫిర్యాదు మేరకు యుగంధర్ రెడ్డి విశ్వనాథరెడ్డి దయానందరెడ్డి రెడ్డప్పరెడ్డి జయమ్మ రామానుజన్ రెడ్డి వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు వీరిలో రాజు నాయుడుకు మరికొందరికి తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు చికిత్స నిమిత్తం వీరికి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు ఈ గ్రామంలో ఎస్టి బీసీలపై దాడులు జరగడం మామూలే గతంలో కూడా టిడిపి గ్రామ అధ్యక్షుడు రవి నాయక్ పై దాడి జరిగిన విషయం తెలిసిందే.

## సజ్జలను కలిసిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాసం రఫీ

**పీలేరు జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర వైకాపా కార్యాలయంలో తాడేపల్లి లో రాష్ట్ర పార్టీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైయస్సార్సీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాసూమ్ రఫీ కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యొక్క విధి విధానాలను తెలుసుకోవడమే కాకుండా వారి ఆశీస్సులతో పార్టీని ముందుకు తీసుకెళ్తామని మాసూం రఫీ అన్నారు ఈ సందర్భంగా సజ్జలను ఘనంగా పూలమాల సెలవులతో సన్మానించినట్లు రఫీ తెలిపారు.

**CHANGE OF NAME**

I CHAGANA BOINA SUMAN YADAV, S/o CHAGANABOYANA SUBBARAYUDU Resident of 20/665, MODAMPALLI BY PASS, PRODDATUR, KADAPA, Dist - 516360, A.P, Here by declare that changed my name in my PASSPORT (L6701970)Name as CHAGANA BOINA SUMAN YADAV (New name) CHAGANABOINA SUMAN YADAV ( OLD NAME

(SS_32100)

**e-procurment tender notice**

Rajampet Municipality

ROC No. 714/E1/2026-27, Date:16-06-2026

| S.NO | 'e' - Procurement Notice No. | Number of Works | Estimate Contract Value (In Lakhs ) |
|---|---|---|---|
| 1 | 22 /GF/DEE/AE/2026-27 to 25 /GF/DEE/AE/2026-27 | 4 | 14.09 |
| | Bid document download start date | 17-06-2026 , 10.00 AM | |
| | Bid document download end date | 01-07-2026 , 3.00 PM | |
| | Last date of receipt of Tender | 01-07-2026 , 3.30 PM | |

Further details can be seen @ 'e' - Procurement Market Place in https://tender.apeprocurment.gov.in/,Contact No:9989051971

**Commissioner**
Rajampet Municipality

# పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. ప్రవీణ్**




**ముద్దనూరు, జూన్ 16 ప్రభాతవార్త:**
ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. ప్రవీణ్ సూచించారు. ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పల్స్ పోలియో సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గ్రామాలు, కాలనీలు, మారుమూల ప్రాంతాల్లోని చిన్నారులను గుర్తించి ఒక్కరూ మిగలకుండా పోలియో చుక్కలు వేయాలని ఆరోగ్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశం అనంతరం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. ప్రవీణ్, జిల్లా ప్రోగ్రాం అధికారి డా. ఆరిఫ్‌లు ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఇమ్యూనైజేషన్ కార్యక్రమ అమలుపై వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ జాసన్‌పై జరిగిన దాడి ఘటనపై విలేకరులు ప్రశ్నించగా, ఘటనకు సంబంధించి ప్రత్యేక అధికారిని నియమించి సమగ్ర విచారణ జరిపిస్తామని డా. ప్రవీణ్ తెలిపారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా. ఆరిఫ్, వైద్యులు డా. కరిష్మా, డా. శ్రీకాంత్, సీహెచ్‌వో వై. ప్రసాద్ యాదవ్, సూపర్‌వైజర్లు ఎం.వి.వి. ప్రసాద్, రాఘవ, రామారావు, శివగంగ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైకాపా ఫేస్‌బుక్ అధికారిక పేజీ బ్యాన్ చేయడం**

# ప్రతిపక్ష గొంతు నొక్కే చర్య

**పులివెందుల,జూన్ 16, ప్రభాత వార్త :**



వైకాపా ఫేస్‌బుక్ అధికారిక వెబ్‌సైట్‌ను బ్యాన్ చేయడం ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కే చర్య అని వైకాపా స్టేట్ సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ కొంగనపల్లి విజయ్ కుమార్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ఎండగడుతున్నామని తెలిపారు. ప్రతిపక్షాల ప్రశ్నలను ఎదుర్కోలేక ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతు వినిపించడం అవసరమని, వాటిని అడ్డుకునే ధోరణి సరికాదన్నారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి ప్రతిపక్షాలను నియంత్రించడంపై ప్రజలు గమనిస్తున్నారని విజయ్ కుమార్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను విరమించుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు.

# వెల్లాలా కుంభాభిషేకంకు మంత్రికి ఆహ్వానం



**రాజుపాలెం,జూన్ 16, ప్రభాతవార్త.**
మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీ సంజీవరాయ స్వామి మూలవిరాట్ పునః కళాకర్షణ, అష్ట బంధన,ఆలయ మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం,విమాన గాలిగోపుర శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఈనెల 29వ తేదీ నుండి జూలై 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న సందర్భంగా ఈ కుంభాభిషేక మహోత్సవమునకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ని ఆలయ చేర్మన్ జి.ఎల్ నారాయణరెడ్డి మంగళవారం నెల్లూరులో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రం అందించి ఎంతో పవిత్రమైన వెల్లాల పుణ్య క్షేత్రంవిశిష్టత, శ్రీ సంజీవరాయ స్వామి మహత్యం చాలా గొప్పదని వివరించి కుంభాభిషేకమునకు తప్పక హాజరు కావాలని ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ నరసింహారెడ్డి, హరి వర్ధన్ రెడ్డి,ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు నైపుణ్య శిక్షణ



**పులివెందుల, జూన్ 16 ప్రభాత వార్త :**
పురపాలక సంఘు పరిధిలోని పారిశుధ్య కార్మికుల సామర్థ్య వృద్ధి, నైపుణ్య అభివృద్ధి కోసం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నాలెడ్జ్ పార్టనర్ అయిన ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో భాగంగా పారిశుధ్య కార్మికులకు పట్టణ పరిశుభ్రత నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాలను తడి–పొడి చెత్తగా వేరు చేయడం, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, ఆరోగ్య మరియు భద్రతా ప్రమాణాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ జి. చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ సి. మునికుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఆర్. నటరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల పట్టణ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణ వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. శిక్షణలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు కొత్త విషయాలను తెలుసుకుని, వాటిని విధుల్లో అమలు చేస్తామని తెలిపారు.పులివెందుల మున్సిపాలిటీ పరిశుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరిచే దిశగా ఈ కార్యక్రమం కీలకంగా నిలిచిందని అధికారులు తెలిపారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలి



**ఒంటిమిట్ట జూన్.16 ప్రభాతవార్త**
పర్యాటక రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని మంగళవారం రెండవ అయోధ్య ఆంధ్ర భద్రాచలంగా పేరొందిన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో మండల విద్యాశాఖ అధికారి వల్లూరు. బ్రహ్మయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కోదండ రామస్వామిని దర్శించడం జరిగింది. ఆ సందర్భంలో కోదండరామస్వామిని దర్శించేందుకు వచ్చిన యాత్రికులు భక్తులు ఆలయంలోని శిల్పకళలను ఆసక్తిగా తిలకిస్తూ ఉండటం చూసి ఆయన ఎంతో సంతోషించి శిల్పకళలను ప్రాముఖ్యతను, ఆలయ చరిత్రను, అతి పురాతన శ్రీ కోదండరామస్వామి చరిత్రను క్షుణ్ణంగా వివరించడం జరిగింది. ఆలయంలోని తూర్పు దిక్కున అధిష్ఠానం మీద ఉన్న వృషభ కుంజనం, సీతారామ కళ్యాణం వంటి సుప్రసిద్ధమైన శిల్ప కళా చిత్ర ప్రాముఖ్యతను ఆయన ఆసక్తిగా తిలకిస్తున్న యాత్రికులకు భక్తులకు వివరించారు. స్థానికులు కూడా అవకాశం వచ్చినప్పుడు ఆలయంలో ఉన్న యాత్రికులకు తెలిసిన మేరకు ప్రాముఖ్యతను వివరించి పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సు లలిత కళ విభాగాధిపతి ఆచార్య మృత్యుంజయరావు, రాయలసీమ టూరిజం కల్చర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండయ్య. జనార్దన రాజు, పర్యాటక ఫోటోగ్రాఫర్ గోప్పు రి. కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# తూకాలలో మోసం చేస్తే చర్యలు తీసుకుంటాం

**లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి**

**బద్వేల్ అర్బన్, జూన్ 16 ప్రభాతవార్త:**
పోరుమామిళ్ల, బద్వేలు మండలాల్లో లీగల్ మెట్రాలజీ శాఖ ఇన్స్పెక్టర్ రమేష్ రెడ్డి మంగళవారం విస్తృతమైన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పత్తి తూకాలు వేస్తున్న ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను (కాటాలను) పరిశీలించగా, వాటిలో తూకం తేడాలు ఉన్నట్లు గుర్తించారు. దీనిపై తక్షణమే కేసు నమోదు చేసి, సదరు వేయింగ్ మిషన్లను సీజ్ చేశారు.అంతేకాకుండా, స్థానిక ఎరువుల దుకాణాలు, ఎలక్ట్రికల్ షాపులు, కిరాణా దుకాణాలలోనూ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను మొత్తం 5, కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డితో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా వెరిఫికేషన్ చేయించని కాటాలను వాడినా, వినియోగదారులకు తూకాల్లో మోసం చేసినా, అలాగే వస్తువులను అధిక ధరలకు విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను దళారులకు అమ్మేటప్పుడు, వారు వాడుతున్న కాటాలకు లీగల్ మెట్రాలజీ శాఖ




వెరిఫికేషన్ ఉందో లేదో తప్పకుండా సరిచూసుకోవాలన్నారు. కేవలం ప్రభుత్వ గుర్తింపు పొంది, సర్టిఫైడ్ అయిన కాటాల ద్వారానే తమ ఉత్పత్తులను విక్రయించాలన్నారు, తూకాల్లో గానీ, ధరల్లో గానీ ఏదైనా మోసం జరుగుతోందని అనుమానం వస్తే వెంటనే అప్రమత్తమై, లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# మార్కెట్ యార్డ్ కమిటీ అజెండాలో అభివృద్ధి పనులకు ఆమోదం

**మైదుకూరు, జూన్ 16, ప్రభాతవార్త:**
మైదుకూరు మార్కెట్ యార్డు కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు అజెండాలో ఆమోదం. ఈ సందర్భంగా మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, రైతులకు మరియు వ్యాపారులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా మార్కెట్ యార్డు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డు ఆదాయాన్ని పెంచే చర్యలతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మార్కెట్ యార్డును రైతులకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దుతూ, ఆదాయ వనరులను పెంచి, అవసరమైన అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, సొసైటీ చైర్మన్ పాశం. మారుతి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్



శ్రీనివాసులు, పాల మాబు, మార్కెట్ యార్డు ఉద్యోగులు, మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు, పలువురు రైతులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**దువ్వూరు, జూన్ 16, ప్రభాతవార్త:**
తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ స్వచ్ఛభారత్ శిక్షన ఆధ్వర్యంలో 6లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వూరు ప్రజలకు ఎన్నో ఏళ్లుగా లేని సౌకర్యాలను ప్రస్తుతం కల్పించామని అందులో భాగంగా ముందుగా బస్ షెల్టర్ నిర్మించామని, బస్ షెల్టర్ నిర్మించి దువ్వూరుప్రొద్దుటూరు మీదుగా ఆర్టీసీ బస్సులు కూడా ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రస్తుతం సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని దీంతో ప్రజలు వినియోగించుకోవాలన్నారు. బస్సు ప్రయాణికులు ఇక్కడికి వస్తే వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ఈ ఇబ్బంది తొలగిపోయిందన్నారు. ఈ మరుగుదొడ్లను పర్యవేక్షించవలసిన బాధ్యత పంచాయతీ అధికారులపై ఉందని వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. ఎక్కడ ఉన్న మైదుకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. గత ఏడాది కేసీ కెనాల్ కు రెండు పంటలకు నీరు ఇచ్చి రైతులకు వరి ఉత్పత్తి ఎక్కువగా పెరిగింది అన్నారు. కేసీ కెనాల్ కు కల్పతరువు అయిన అలగనూరు బ్యాలెన్స్ రిజర్వాయర్ రిపేర్లకు గాను నిధులు కేటాయించారని, ఇక కేసీ కెనాల్ నీటికి డోకా ఉండదు అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎప్పటికీ అండగా ఉంటానని వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, తాసిల్దార్ సంజీవరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈలు శివకుమార్, సుబ్రహ్మణ్యం, మండల టిడిపి ఇన్చార్జ్ పాపినేని రాంబాబు, ప్రతాప్ నాయుడు, వెంకటసుబ్బయ్య, హుస్సేన్ సాహెబ్, నరసింహా రాయల్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



**జమ్మలమడుగు, జూన్ 16, ప్రభాతవార్త:**
కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల నుంచి చేసిన అభివృద్ధి పనులపై మంగళవారం జమ్మలమడుగులో నిర్వహించిన విజయోత్సవ సభకు వేలాది మంది కూటమి నాయకులు పాల్గొనడంతో జమ్మలమడుగు దద్దరిల్లింది. ఈ సందర్భంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ కడప జిల్లా అధ్యక్షులు భూపేష్‌రెడ్డి పట్టణంలోని నారాపుర వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా తేరు రోడ్డు గాంధీ రోడ్డు మీదుగా స్థానిక పాత బస్టాండులోని గాంధీ కూడలికి చేరుకున్నారు. ఈ ర్యాలీ వెంబడి కూటమి ఽకూటమి నాయకులు, టీడీపీ నాయకులు ఆనందంతో చిందులు వేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో నూతన రోడ్ల నిర్మాణాలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు, తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు నగదు పంపిణీ, ఉచిత గ్యాస్ పంపిణీ, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు చేయూత అందించామన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు మేలు చేస్తారని ఓట్లు వేసిన ప్రజలను వైసీపీ ప్రభుత్వంలో ఉచితంగా వచ్చిన ఎమ్మెల్సీ పదవితో డబ్బులు వెనకేసుకోవడమే తప్ప నియోజకవర్గంలోని దాల్మియా ఫ్యాక్టరీ బాధితులు మరియు పెద్దముడియం మండలంలోని రాజోలి ఆనకట్ట బాధితుల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం వచ్చాక ప్రజల పక్షాన నిలుస్తున్నామని చెప్పడమే తప్ప ఇలాంటి అభివృద్ధి చేయలేని రామసుబ్బారెడ్డి తమను ప్రశ్నించే హక్కు లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామ రూపాలు లేకుండా పోవడం తథ్యమని వైసీపీ నాయకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, చదిపిరాళ్ల రా జేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పాల్యం వెంకట సుబ్బమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు జంబాపురం రమణారెడ్డి, మార్కెట్ నాయకులు జంబాపురం రమణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బిర్రు గుర్రప్ప, కడప జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నతోట శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాధులు సోకని బిడ్డతోనే
# బలమైన ముందు తరం సాధ్యం

**వైద్యురాలు శ్రీ గిరీష**



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పీలేరు జూన్ 16 ప్రభాతవార్త:**
డయేరియా సోకిన పిల్లలకి ఓఆర్ఎస్ రక్షణ, మరియు జింక్ మాత్ర యొక్క శక్తి తో "నీళ్ల విరోచనాలు" కు అడ్డుకట్ట సాధ్యమని పి.హెచ్. సి తలుపుల ప్రధాన వైద్యాధికారులు శ్రీ గిరీష అన్నారు. నేడు "స్టాప్ డయేరియా" ప్రారంభ రోజున డా: శ్రీగిరీష సిబ్బందికి శిక్షణ,అవగాహన మరియు ర్యాలీ కార్యక్రమాలు తలపులలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్డకు విరోచనాలు సమయంలో తల్లితోపాటు కుటుంబ సభ్యులు అవగాహన కలిగి వేగంగా స్పందించి , బిడ్డ ప్రాణాలను కాపాడాలని ఫలితంగా 05 సం:పిల్లల మరణాలను 0 (జీరో) కి తీసుకు రావడం స్టాఫ్ డయేరియా ప్రధాన ఉద్దేశ్యామని,నేటి నుండి స్థానిక ఆశా కార్యకర్తలు 0 5 పిల్లలున్న గృహాల్లో ఓ.ఆర్.యస్ పాకెట్స్ జింక మాత్రలు ఇచ్చి అవసరమగు ఆరోగ్యవిద్యా అందిస్తారని, కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య,సెక్రటరీ సుబ్రహ్మణ్యం రెడ్డి, హెచ్.వి నాగమ్మ, ఏఎన్ఎంలు. ఫాముసా, నాగవేణి, ఆశా, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహిస్తాం

**పీలేరు జూన్ 16 ప్రభాతవార్త:**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తామని పీలేరు ఆర్టీవో నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్వీ ఎస్ ఎస్ కల్యాణమండపంలో పీలేరు అసెంబ్లీ 163 నియోజకవర్గం బూత్ లెవెల్ ఏజెంట్లకు సర్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. జూలై 14వ తేదీ వరకు నెల రోజుల పాటు జరిగే కార్యక్రమంలో చనిపోయిన, ఊరు వదలి వెళ్లి పోయిన, డబుల్ ఎంట్రీలను తొలగించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివకుమార్. ఆర్ఐ మురగయ్య, ఏఎస్ వో రెడ్డెప్పనాయుడు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.






## పల్స్ పోలియో, స్టాప్ డయేరియా
# కార్యక్రమాలను విజయవంతం చేద్దాం

**వాల్మీకిపురం జూన్ 16 ప్రభాతవార్త:**
ఈనెల 28వ తేదీ ఆదివారం నిర్వహించబోవు ఐ.పి.పి.ఐ. (ఉధృత పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం )మరియు స్టాప్ డయేరియా (16/6/26 నుండి 31/7/26)కార్యక్రమాలను విజయవంతం చేద్దాం అని చింతపర్తి ఇంచార్జి వైద్యులు ఆశిక్ మరియు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పి.హెచ్.సిలోపై రెండు కార్యక్రమాలకు సంబందించి ఆశా, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలకు, ఎమ్.ఎల్.హెచ్.పి లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుచు జూన్ 28వ తేదీ ఆదివారం రోజు అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు రెండు పోలియో చుక్కలు నిర్దేశించిన బూత్ లలో పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. స్టాప్ డయేరియ (అతిసార ను నిలిపేద్దాం )కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఐదు సంవత్సరాల లోపు పిల్లలలో జరిగే మరణాలకు ప్రధాన కారణం అతిసార వ్యాధి. ఈ వ్యాధి వైరస్ వల్ల వస్తుంది. రోజులో ఐదు లేదా ఆరు సార్లు పలుచటి నీల్ల బేధులు ఐతే వాటిని అతిసార అంటారు. ఈ కార్యక్రమం లో ఆశాకార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఆ ఇంటిలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ఉంటే రెండు ఓ. ఆర్. ఎస్. పాకెట్స్ ఇస్తారు. ఎవరికైనా నీళ్ల విరోచనాలు ఉంటే ఓ. ఆర్. ఎస్ తో పాటుగా జింక్ మాత్రలు ఇచ్చి 14రోజులు చికిత్స ఇవ్వడం జరుగుతుంది అన్నారు.. చేతుల శుభ్రత పాటించడం, మరుగుదొడ్లు ఉపయోగించడం, త్రాగు నీరు కాచి చల్లార్చి వాడుకోవడం, చద్ది ఆహారం తినరాదు. చంటి పిల్లలకు మొదటి ఆరు నెలలు తల్లి పాలు తప్ప వేరే ఏది ఇవ్వరాదు. ఆహారపదార్థలపై మూతలు ఉంచాలి, ఓ. ఆర్. ఎస్ ద్రావణం ఎలా తయారు చేసుకోవాలి, ఎంతకాలం నిల్వ ఉంచుకోవాలి, ఎక్కడ దొరుకుతాయి అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు అని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు.



# మోడీ గారూ పెట్రో ధరలు తగ్గించండి...



**వేంపల్లె జూన్ 16 ప్రభాతవార్త**
అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర తగ్గినందువల్ల దేశంలో పెట్రోల్, డీజీలు,వంట గ్యాస్, కమర్షియల్ గ్యాస్ ధరలను తగ్గించాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మంగళవారం వేంపల్లె లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అమెరికా ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర పెరిగింది అన్నసాకు చూపి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను ఇటీవల నాలుగు సార్లు పెంచింది అన్నారు. ప్రస్తుతం అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒ ప్పందం కుదిరింది. యుద్ధం ముగిసింది..అంతర్జాతీయ మార్కెట్లో ముడిచ మురు ధర బ్యారేల్‌కు 120 డాలర్ల నుండి 83 డాలర్లకు పడిపోయింది. కాబట్టి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ధరలను ఉపసంహరించుకోవాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

వార్త
అన్నమయ్య జిల్లా
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
గుర్రంకొండ, కె.వి.పల్లె,
కలకడ బి.కొత్తకోట
ఇంటర్వ్యూ తేది : 17.06.2026
మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086

వార్త
కడప జిల్లా
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
ఖాజీపేట, వల్లూరు, కమలాపురం,
చెన్నూరు, కడప కలెక్టరేట్,
చింతకొమ్మదిన్నె
ఇంటర్వ్యూ తేది : 17.06.2026
మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086